ప్రజాశక్తి

మంగళవారం 13 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పిపిపిలకే సపోర్టు..!

◆ శరవేగంగా పలు ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ◆ పోర్టు ఆసుపత్రి సాధ్యతపైనా అధ్యయనం



విశాఖ పోర్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ పోర్టులో బెర్తుల ప్రైవేటీకరణ ఊపందుకుంటోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)కు సంబంధించిన ప్రాజెక్టులకు శరవేగంగా క్లియరెన్సులు వచ్చేస్తున్నాయి. పిపిపి విధానంలో దేశంలోని 13 మేజర్ పోర్టులనూ కేంద్రం ప్రైవేటుపరం చేసేందుకు తీవ్ర యత్నాల్లో నిమగ్నమైన సంగతి తెలిసిందే. అంతకంతకూ విశాఖలో బెర్తులన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించేలా పోర్టు అధికారులపై కేంద్రం ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. నిర్వహణ భారాన్ని తక్కువగా మోయడం ద్వారా అత్యధికంగా లబ్ధిపొందాలన్న భావనతో పోర్టులకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను జారీచేయడంతో ఆ దిశలో 'ల్యాండ్ లార్డ్' పోర్టు ప్రయాణం చేస్తోంది. తాజాగా పిపిపిలో కైలాసపురం వద్ద 5.8 ఎకరాల్లోగల పోర్టు ఆసుపత్రి నడుస్తోంది. దీన్ని రూ.250 కోట్లు నుంచి రూ.300 కోట్లకు పిపిపి కింద ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. టెండర్ల కోసం పోర్టు ఎదురుచూస్తోంది. దీనిపై ఫీజిబిలిటీ స్టడీ (సాధ్యతల అధ్యయనం) జరుగుతున్నట్లు పోర్టు అధికారుల ద్వారా వెల్లడవుతోంది. పిపిపి కోసం ఈక్యూ -7, డబ్ల్యూ క్యూ 7, 8, ఈక్యూ 6 బెర్తులకు సంబంధించిన టెండర్లన్నీ దాదాపు పూర్తయిపోయాయి. సుమారు రూ.68 కోట్లకు ఈ బెర్తులను ప్రైవేట్‌కు ఇచ్చేందుకుగానూ కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. టెండర్లు కూడా పూర్తికావడంతో ఈ బెర్తులకు సంబంధించి పోర్టు సెక్యూరిటీ క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తోంది. వైజాగ్ పోర్టులోని 21 బెర్తుల్లో సగానికిపైగా పిపిపి కిందనే నడుస్తున్నాయి. రెగ్యులర్

మిగతా 2లో..

రైతుకు పరిహారం లేనట్లే..

◆ కోసిన వరికి నష్టం వర్తించదంటున్న ప్రభుత్వం ◆ కోయక ముందు పోయిన పంటల నమోదు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మాండూస్ తుపానుకు నష్టపోయిన వరి రైతుకు కన్నీరే మిగలనుంది. కోసిన తరవాత నీట మునిగిన పంటకు ప్రభుత్వం నుంచి రైతుకు ఎటువంటి నష్టపరిహారమూ అందేలాలేదు. జిల్లాలో దాదాపు కోసిన వరిచేను నాలుగు వేల ఎకరాలకు పైగా నీట మునిగింది. దీనికి రెట్టింపు విస్తీర్ణంలో వరి చేను ఆరకముందే రైతులు కుప్పలు వేశారు. ఇలా కుప్పలు వేసిన ధాన్యం రంగు మారుతుందని రైతులు అంటున్నారు. నీట మునిగిన వరిచేను కొన్ని ప్రాంతాల్లో 80 శాతానికిపైగా దెబ్బతింది. కోసిన తరువాత జరిగిన వరి పంట నష్టానికి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి నష్టపరిహారాలేవీ వర్తించవని సోమవారం సాయంత్రం వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ కమిషనర్ తేల్చిచెప్పారు. చెరువుల కింద, పల్లపు ప్రాంతాల్లో



నక్కపల్లిలో నీటిలోనే ఉన్న వరి పనలు

మిగతా 2లో..

పంట నష్టపరిహారం చెల్లించాల్సిందే : సిపిఎం

అనకాపల్లి : మాండూస్ తుపానుతో పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, రైతుల అప్పులను ప్రభుత్వం మాఫీ చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడ్రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలకు 12 మండలాల పరిధిలో 74 గ్రామాల్లో సుమారు 947 ఎకరాల కోసిన వరిచేను నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసిందని, అయితే ఈ ప్రాథమిక అంచనాకు మించి పంట నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో నీట మునిగిన పంటను గుర్తించి, పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని

మిగతా 2లో..



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

పార్టీ మారుతున్నాననేది తప్పుడు ప్రచారం : గంటా

▶ వార్త మెయిన్‌లో..



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

పన్ను వసూలు బాధ్యత

మాకొద్దు బాబోయ్

వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల మొర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చెత్త పన్ను, యూజర్ ఛార్జీల వసూలు బాధ్యత నుంచి తమను తప్పించాలని, లక్ష్యాలు విధిస్తూ మానసిక ఒత్తిడికి గురి చేయడం భావ్యం కాదని జివిఎంసి వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు నిరసన తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కావాతి పీటర్ మీడియాతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూలు విషయంలో జోన్ 4 అధికారులు తీవ్రమైన పని ఒత్తిడి చేయడంతో కార్యదర్శి బాకూరి చంద్రమోహన్ తట్టుకోలేక మరణించారని చెప్పారు. దీంతో ఆయన

మిగతా 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో..

16 వేల దొంగ ఓట్లు

◆ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆరోపణ ◆ విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



విశాఖ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో 16 వేల వరకు దొంగ ఓట్లు నమోదయ్యాయని, విచారణ జరిపి తక్షణం తొలగించాలని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో 3, 5, 10, ఇంటర్, ఆఖరికి నిరక్షరాస్యులు కూడా ఓటర్లుగా నమోదయ్యారన్నారు. కొంతమంది పేర్లు రెండు, మూడు సార్లు వచ్చాయన్నారు. కేవలం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పిపిపిలకే సపోర్టు..!

ఉద్యోగులతో సమానంగా వేల సంఖ్యలో ఇండైరెక్ట్ ఉద్యోగులూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈక్యూ 1 అదానీ బెర్త్ స్వాధీనం... పోర్టుకు రూ.30 కోట్లకుపైగా లాభం

ఈ కాలంలో వైజాగ్ పోర్టులో చెప్పుకోదగ్గ విషయానికొస్తే.. 2011 నుంచీ అదానీ ఆధీనంలోగల ఈక్యూ -1 బెర్తును విశాఖ పోర్టు ఈ ఏడాది మేలో స్వాధీన పరచుకున్న సంగతి తెలిసిందే. ఈ బెర్తుపై అప్పట్లో లోడింగ్ టెస్టులు నిర్వహించారు. తాజాగా ఆపరేషన్స్‌లోకి వచ్చింది. గడచిన నాలుగు నెలల్లో రూ.30 కోట్లకు పైగానే ఈ బెర్తుపై పోర్టు లావాదేవీలు నెరపి ఆదాయం సంపాదించింది. అదానీ బెర్తులో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఒఅండ్ఎం) ద్వారా ఒక ఏడాదికి టెండర్లను పిలవడం ద్వారా కార్గో హేండ్లింగ్ ఛార్జీలను పోర్టు సాధించింది. అదానీ నుంచి హేండోవర్ చేసుకున్నాక పలు రకాల వెస్సెల్ రిలేటెడ్ ఛార్జీల రూపంలోనూ పోర్టు అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

రైతుకు పరిహారం లేనట్లే..

కోయని వరిచేను దెబ్బతింటే, ఆ విస్తీర్ణం నమోదు చేయాలని సూచించారు. ఈ తరహా పంట నష్టం వివరాలను ఈ నెల 21లోపు నమోదుచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వనున్నారు. వర్షాలకు పంటపోయిందని బాధపడుతున్న రైతుకు భరోసా ఇచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిబంధనల పేరుతో నష్ట పరిహారం ఎగ్గొట్టాలని చూస్తోంది. ప్రభుత్వం నుంచి ఏ మాత్రమైనా నష్ట పరిహారం అందుతున్న ఆశ రైతుకు లేకుండాపోయింది. ఎకరాకు రూ.20 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. నీట మునిగిన పంట పెట్టుబడులకు కూడా రాదని రైతులు వాపోతున్నారు. పెట్టుబడికి తోడు, కౌలు ఇవ్వాల్సివుండడంతో కౌలు రైతులు మరింత చితికిపోనున్నారు. రైతులు, కౌలురైతులు మాండూస్ దెబ్బకు కోలుకోలేని స్థితికి నెట్టబడ్డారు. వర్షాలకు రంగు మారిన ధాన్యానికి ప్రభుత్వ ప్రకటిత కనీస మద్దతు ధర లభించే అవకాశంలేదు. ఇక్కడ కూడా ప్రభుత్వ నిబంధనలు కొనుగోలుకు ఆటంకంగా వున్నాయి. రంగుమారిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనే అవకాశంలేక, చివరకు ప్రయివేటు వ్యాపారులకు వారిచ్చిన రేటుకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుకు రానుంది.

పంట నష్టపరిహారం చెల్లించాల్సిందే : సిపిఎం

కోరారు. వర్షాలకు పంట దెబ్బతినడం వల్ల పెట్టుబడులకు కూడా డబ్బులు రాక రైతు అప్పుల పాలవుతున్నట్టు తెలిపారు. ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో కౌలు రైతు తుమ్మి శంకరరావు సుమారు 80 వేలు పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో వరి పంట వేసాడని, ఆ పంటను కోసి కుప్పలు వేసేలోగా మాండూస్ తుపాను వచ్చి ఆ పంటంతా తడిచిముద్దవ్వడంతో ఆ రైతు కన్నీటి పర్యంతమయ్యాడని అన్నారు. అటువంటి వారు జిల్లాలో చాలా మందినే ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక అంశాలు చూడకుండా విధిగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రకటిత మద్దతు ధరను ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఏ దశలో ధాన్యం పంట దిబ్బతిన్నా రైతులకు ఎకరా వరికి రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని, వాస్తవ కౌలు రైతులను గుర్తించి పంట నష్ట పరిహారం వారికే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ తుపాను వల్ల పంట నష్ట తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా పంట నీటమునడం, తడిచిపోవడాన్ని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. పంటకు నష్టం జరిగి ఈ - క్రాప్‌లో నమోదుకాని రైతులకు కూడా పరిహారం అందించాలన్నారు. ప్రకతి విపత్తుల సమయంలో సాంకేతిక అంశాల జోలికిపోకుండా, మానవతా దృక్పథంతో రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పన్ను వసూలు బాధ్యత మాకొద్దు బాబోయ్

కుటుంబం వీధిన పడిందన్నారు. అతని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. అతని కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకంలో ఉద్యోగం కల్పించాలన్నారు. చంద్రమోహన్ మృతికి కారకులైన జోన్ 4 కమిషనర్ చక్రవర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చెత్త పన్నును ఆస్తి పన్ను, నీటి పన్నులలో విలీనం చేసి వసూలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జంగం అహర్నిశ, ఆడారి శివ, అడిగర్ల శ్రీనివాసరావు, నున్న పార్థసారథి, రమేష్ బాబు, డాక్టర్ గీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

16 వేల దొంగ ఓట్లు

ఉత్తరాంధ్రలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల వరకు ఇటువంటి తప్పుడు ఓట్లు నమోదు కాబడ్డాయన్నారు. గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా ఇటువంటి తప్పుడు ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. అలాంటి వ్యవస్థను తెచ్చింది దీనికేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త విజయబాబు, పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మాధవ్ ఫిర్యాదు

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అనర్హులు ఉన్నారంటూ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పాత నగరంలో పప్పుల చిట్టీల పేరుతో 14 వేల మందిని మోసగించి పరారైన నైన్ స్టార్ కంపెనీ నిర్వాకుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ప్రతి నెలా ఇచ్చి ఆదుకోవాలన్నారు.

ఉచిత ఇళ్లకు డబ్బులా..

ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను ప్రశ్నించిన లబ్ధిదారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇచ్చి, పక్కా గృహాలను ఉచితంగానే నిర్మించి అందజేస్తామని నాడు ప్రభుత్వం చెప్పిందని, నేడు ఇళ్ల స్థలాల పొందిన తమను ఇప్పుడు ఇంటికి రూ.35 వేలు చెల్లించాలని వాలంటీర్లు అడుగుతున్నారని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 31వ వార్డులోని కృష్ణ టెంపుల్ సచివాలయం చాకలిపేట వద్ద నుంచి ఎమ్మెల్యే గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. వార్డులో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శానిటేషన్ సిబ్బంది సరిగా కాలువలు శుభ్రం చేయడం లేదని, కొన్ని ప్రాంతాల్లో కుళాయిల్లో నీరు సరిపడా సమయం ఇవ్వకుండా, తక్కువ సేపు ఇస్తున్నారని, ఆ సమయాన్ని పెంచాలని, వీధి లైట్లు కొన్ని చోట్ల వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పల్లా శ్రీను, మకర గోపి, నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాసుపల్లిని నిలదీస్తున్న స్థానికులు

108 ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 108 ఉద్యోగులకు బకాయి ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద 108 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. 108 ఉద్యోగులకు రావాల్సిన రెండు నెలల వేతన బకాయిలను వెంటనే జమ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిర్వహణ సంస్థ ద్వారా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, కోశాధికారి బి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన 108 ఉద్యోగులు

సమస్యలపై మీటర్ రీడర్ల ధర్నా



డిఇకి వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిఎమ్‌డి చెప్పిన మేరకు మీటర్ రీడింగులు గడువును ప్రతి నెలా 15వ తేదీ వరకూ ఇవ్వాలని, అలా కాకుండా 11 రోజులలోగా రీడింగు తీయడం పూర్తి కావాలనే షరతు సరికాదని పేర్కొంటూ సోమవారం గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగాగల ఎస్‌సి ఆపరేషన్ కార్యాలయం ఎదుట ఎపి ఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కె.శివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ జులై 1న సిఎమ్‌డి తమకు చెప్పిన మేరకు మీటర్ రీడింగులు తీయడానికి 15వ తేదీ వరకు గడువు ఉండాలన్నారు. ప్రతి నెలా 2వ తేదీ నుంచి 12వ తేదీలోగా అంటే 11 రోజుల్లోనే మీటర్ రీడింగులు తీయడం పూర్తి కావాలని చెప్పి, మీటర్ రీడర్స్ జీతాలలో కాంట్రాక్టర్లు కోత విధించడం సరికాదన్నారు. వర్షాలు, అనివార్య కారణాలవల్ల మీటర్ రీడింగులు తీయటంలో జాప్యం జరిగే వీలుంటుదన్నారు. కనుక 15వ తేదీ వరకు మీటర్ రీడింగ్ తీయడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని దినాల కుదింపు సరికాదన్నారు. డోర్ లాక్ సర్వీసులకు రీడింగులు తీయలేదని చెప్పి, జీతాలు కోత విధించడం అన్యాయమన్నారు. ఈసరికే కోత పెట్టిన జీతాలను తిరిగి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. నగర పరిధిలో ఒక్కొక్క మీటర్‌కు రూ.9.30 పైసలు, గ్రామీణ ప్రాంతంలో రూ.9.69 పైసలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను గుర్తించి కొత్త రేట్లు అమలు చేయాలని కోరారు. ఈ మేరకు డిఇ టెక్నికల్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, కోశాధికారి సుభాన్, సురేష్, ఖాన్, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ - 2022లో భాగంగా జోనల్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ స్థానిక స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో సోమవారం ప్రారంభమైంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యమే కాకుండా మానసిక దారుఢ్యమూ పెరుగుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె ఉత్తరాంధ్ర నుంచి పాల్గొంటున్న ఆరు జిల్లాల క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కళ్యాణి, స్థానిక కార్పొరేటర్ పద్మా రెడ్డి, ఒలింపియన్ మాణిక్యాలరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, అర్జున అవార్డు గ్రహీత చింతా ప్రతాప్, పద్మనాభం, సెట్విస్ సిఇఒ నాగేశ్వరరావు, శాప్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి విశాఖ తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో ఆదివారం ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, 2010 నుంచి 2016 వరకు ఆధార్ కార్డులు పొంది డాక్యుమెంట్ అప్డేట్ చేయించుకోవాలనుకునేవారు ఇక్కడకు వచ్చి సేవలను వినియోగించుకోవాలని పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు కోరారు.

పోలీస్ స్పందనకు 46 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 46 వినతులు అధికారులకు అందాయి. ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు వీటిని పరిశీలించారు. కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలు, సివిల్ విషయాలే అధికంగా ఉన్నట్టు తెలిపారు.

సాగర తీరంలో సీ ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : థీమ్ ఆధారిత రెస్టారెంట్ చైన్ ప్లాట్‌ఫారమ్ 65 పేరిట తలపెట్టిన సీ ఫుడ్ ఫెస్టివల్ సాగర తీరంలో సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 19 వరకూ ఇది కొనసాగనుంది. నోరూరించే పీతల వేపుడు, రావా ఫిష్ ఫ్రై, తందూరీ ఫుల్ ఫిష్, ఫుల్ ఫిష్ ఫ్రై, తందూరీ పాంఫ్రెట్, తందూరీ టైగర్ ప్రాన్స్, స్కిడ్ మసాలా, స్కిడ్ వేపుడు వంటి అనేక రకాల సీ ఫుడ్స్ నోరూరిస్తున్నాయి. ప్లాట్ ఫారమ్ 65 భారతదేశంలోనే అతిపెద్ద థీమ్ రెస్టారెంట్ అని నిర్వాహకులు తెలిపారు. టాయ్ ట్రైన్ సాయంతో కస్టమర్ల టేబుల్ వద్దకే ఆహారం అందిస్తూ ఎందరో భోజనప్రియుల మన్ననలు పొందుతోందన్నారు. సాగర తీరంలో తలపెట్టిన ఈ ఫెస్టివల్‌కు అందరూ తరలివచ్చి సీ ఫుడ్స్ రుచులను ఆస్వాదించాలని మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ సద్గుణ్ పాఠక్ కోరారు.

ఏడుకొండల రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హోమ్‌గార్డు డిఎస్‌పిగా దుండి ఏడుకొండలరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 1991లో ఎఆర్‌పిసిగా పోలీసు డిపార్టుమెంట్‌లో చేరిన ఆయన 1996లో ఆర్ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖ హోమ్ గార్డు డిఎస్‌పిగా నియమితులయ్యారు. ఆయన విశాఖపట్నంతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం జిల్లాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు. విధినిర్వహణలో అడవులలో దాదాపుగా లక్ష కిలోమీటర్లపైగా నడిచిన వ్యక్తిగా ఏడుకొండలరెడ్డి పేరొందారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై కార్మికులు కలిసికట్టుగా పోరాడాలని విశాఖ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, జిల్లా నాయకులు పి.వెంకటరెడ్డి, వరప్రసాద్ అన్నారు. ఆరిలోవలోని ఎర్రి దుర్గా కళ్యాణమండపంలో సోమవారం సిఐటియు ఆరిలోవ జోన్ మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు కారుచవకగా అమ్మకానికి పెడుతోందని విమర్శించారు. దేశంలో కష్టజీవుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక చట్టాలు స్థానంలో లేబర్ కోడ్ తీసుకొచ్చి అన్యాయం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆరిలోవ జోన్ ప్రధాన కార్యదర్శి వి.ఎన్.కుమార్ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యూనియన్ అధ్యక్షులుగా ఐసి.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎ.రమణ, కోశాధికారిగా బి.రత్నం, కార్యదర్శులుగా పైడిరాజు, కిషోర్ కుమార్, ఆఫీస్ బ్యారర్లుగా, కమిటీ సభ్యులుగా వంకర ఈశ్వరరావు, అలుగోలు జ్యోతి, మంగమ్మ, రాజు తదితర 8 మందిని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 52వ వార్డు పరిధి ఆర్‌ఎఫ్ఎస్ఎల్ ఆఫీస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందారు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం... 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా లే-అవుట్‌లోని శ్రీ వాత్స్య ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌లో సింగంపల్లి మురళీకృష్ణ (36) కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పనిమీద ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లారు. దాట్ల అపార్ట్‌మెంట్స్ ఎదురుగా మ్యాన్ హోల్ నిర్మాణ పనుల కోసం తవ్విన తారు రోడ్డు వ్యర్థాలను అక్కడే వదిలి వేయడంతో చీకటితో కనబడక వాటిని ఢీకొట్టి పడిపోయారు. తలకు తీవ్రగాయమై స్పృహ కోల్పోయారు. స్థానికులు 108కు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి అతని భార్యకు ఫోన్ ద్వారా విషయం తెలిపారు. ఆమె వెంటనే వచ్చి మర్రిపాలెంలోని సురక్ష ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు. పలు పనుల నిమిత్తం రోడ్లను తవ్వి వదిలేయడంతో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కొరియర్ వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

ప్రజాశక్తి -కంచరపాలెం : జీవీఎంసీ 52వ వార్డు పరిధి కరాస జంక్షన్ బిఆర్‌టిఎస్ రహదారి వద్ద సోమవారం రాత్రి కొరియర్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కంచరపాలెం నుంచి ఎన్ఎడి వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు కరాస జంక్షన్ వద్దకు వచ్చే సరికి రహదారిని అధిగమిస్తున్న వ్యక్తిని తప్పించబోయి ఎన్ఎడి నుంచి కంచరపాలెం వైపుగా వెళ్తున్న కొరియర్ వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో కొరియర్ వాహన డ్రైవర్ కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -మాడుగుల : మండలంలోని కింతలి గ్రామానికి చెందిన దామరౌతూ శ్రవణ్ కుమార్ అనే యువకుడు పెద్దేరు రిజర్వాయర్లో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 9న జీవితంపై విరక్తితో తాను చనిపోవాలనుకుంటున్నానని మొబైల్ ఫోన్లో తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టి కనిపించకుండా పోయాడు. పెద్దేరు రిజర్వాయర్ సమీపంలో అతని బైక్ కనిపించడంతో రెవెన్యూ, పోలీసుల అధికారులకు సమాచారమిచ్చి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం తెల్లవారుజామున పెద్దేరు రిజర్వాయర్ గేటు సమీపంలో మృతదేహం తేలింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మాడుగుల ఎస్ఐ దామోదర్ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెఎన్‌టియు వాలీబాల్ జట్టుకు 'చైతన్య' విద్యార్థి

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎం పాలెం సాంకేతిక కళాశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో కొమ్మాదిలోని చైతన్య కళాశాల బిటెక్ ఎఐ అండ్ ఎంఎల్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అనుసూరి బ్రైనార్డ్ జెఎన్‌టియు వాలీబాల్ జట్టులో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జెఎన్‌టియు జివి విజయనగరం తరుపున ఈ నెలాఖరులో చెన్నై ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఫైనాన్స్ డైరెక్టర్ పి.మాధవి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.పార్వతి, పీడీ పి.వేణుగోపాల్ రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా మినిస్ట్రీస్ హోలీ చర్చి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆర్మీ ఆఫ్ ది లార్డ్ మినిస్ట్రీస్ హోలీ చర్చి 29వ వార్షికోత్సవం ఆరిలోవ చివరి బస్టాపు సమీపంలోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులకు, వికలాంగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ హాజరై మాట్లాడుతూ, 29 సంవత్సరాలు హోలీ చర్చిని దిగ్విజయంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన వ్యవస్థాపకులు గుంటి అరుణ్ పాల్‌ను అభినందించారు. అనంతరం జాన్ వెస్లీని సంఘ పెద్దలు, సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ శ్యామ్‌బాబు, సైమన్, రెవరెండ్ ఆంథోనిరాజ్, రెడ్డిపాల్, గుంటి సూర్యం మత పెద్దలు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - ఆనందపురం : బోధకాలు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కె.స్వప్న కోరారు. గంభీరంలోని వాగ్దేవి విద్యా మందిర్‌లో విద్యార్థులకు రక్త నమూనా సేకరణ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోధకాలు వ్యాధి సోకితే దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. వ్యాధి నివారణకు డై ఇథైల్ కారమజీన్ (డిఇసి), ఆల్బెండ జోల్ బిల్లలు 21 రోజులు పాటు కోర్సుగా వాడాలన్నారు. ఒకసారి ఈ వ్యాధి వల్ల నాళాలు దెబ్బతింటే కాలు వాపు వస్తూ పోతూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా 47 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, డిపిఎంఓ భీమేశ్వరరావు, ఎస్.గోపాలకృష్ణ, సిహెచ్ శంకరరావు, ఎంవి రామకృష్ణ, జి.సత్యనారాయణ, ఎం.సత్యవతి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిషేధం : ఎసిపి


ఆనందపురం కూడలిలో పరిశీలిస్తున్న ఎసిపి కుమారస్వామి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కూడలిలో ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు నిషేధించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాఫిక్ ఎసిపి కుమారస్వామి పోలీసులకు సూచించారు. ఆనందపురం కూడలిలోని పూల మార్కెట్ ఫుట్‌పాత్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం కలుగుతుందన్నారు. చిరు వ్యాపారస్తులు, పువ్వులు అమ్మేవారు రోడ్లపై విక్రయాలు చేపట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. వాహనాలను రోడ్లపై నిలపరాదని పేర్కొన్నారు. ఆనందపురం పూల మార్కెట్‌లో వ్యాపారస్తులు రోడ్లపై కాకుండా మార్కెట్లోనే అమ్మే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

వేములవలస పూల మార్కెట్ ఆశీలు వసూలు చేసే వారితోను, ఆటో డ్రైవర్లు, వ్యాపారస్తులతో మాట్లాడారు. అనంతరం రోడ్డు కిరువైపులా ఉన్న షాపుల వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఫుట్ పాత్‌ల నుంచి రోడ్డుపైకి రాకుండా రైలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ నరసింహమూర్తి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన వరిపంట పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : తుపాను నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తాళ్లవలస, తాటితూరు, టి.నగరపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి సోమవారం పరిశీలించారు. మండలంలో ఖరీఫ్‌లో 1336 ఎకరాల వరి పంట సాగవ్వగా, 470 ఎకరాల్లో పంట కోత అయిందని తెలిపారు. 428 ఎకరాలు కోసిన పంట కుప్పలుగా వేయగా, 42 ఎకరాల పంట పనలపై ఉండగా, నీట మునిగినట్లు తమ ప్రాథమిక పరిశీలనలో తేలినట్లు పేర్కొన్నారు. మద్దతు ధరపై ఆందోళన చెందనసరం లేదని రైతులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. తేమ శాతం 11 నుంచి 17 శాతం మధ్యలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

మండలంలోని తాటితూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సిరిగిడి సంతోషి ప్రారంభించారు. ధాన్యం సేకరణ, కొనుగోలులో భాగంగా తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి బి శివకోమలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023-24పై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు సోమవారం ఎండిఒ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఇందుకు రూపొందించిన బుక్‌లెట్‌ను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసు రాజు), జెడ్పిటీసీ సభ్యులు గాడు వెంకటప్పుడు ఆవిష్కరించారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల క్షేత్ర స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళిక తయారీ, అమలుపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఎండిఒ పి.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి పంచాయతీ విస్తరణాధికారి శంకర్‌జగన్నాథ్ నోడల్ అధికారిగా వ్యవహరించారు.



అభివృద్ధి ప్రణాళిక బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఎంపిపి వాసురాజు

గంజాయి సరఫరాకు అడ్డాగా రాష్ట్రం : తెలుగుయువత

ప్రజాశక్తి -పిఎం పాలెం: గంజాయి, డ్రగ్స్ సరఫరాకు రాష్ట్రం అడ్డాగా మారిందని పార్లమెంటరీ తెలుగు యువత కార్యదర్శి గరే గురునాథ్ ఆరోపించారు. గంజాయి, డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని కోరుతూ పిఎం పాలెం స్టేషన్‌లో గరే గురునాథ్, టిడిపి ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం గరే గురునాథ్ మాట్లాడుతూ, యువత ఎక్కువగా గంజాయి, డ్రగ్స్ వాడకానికి బానిసలవుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మధురవాడ పరిసర ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతుందన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -మధురవాడ, పిఎంపాలెం : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల 10వ తరగతి 1996-97బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు శివాజీ పార్క్‌లో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వివిధ వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడి ఉండే పూర్వ విద్యార్థులంతా 25 సంవత్సరాల తరువాత ఒకేచోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు బొట్ట సూరిబాబు, నాగోతి అప్పలరాజు, శ్రీకాంత్, రామకృష్ణ, లోవరాజు, బాలుపాత్రో తెలిపారు.

సహకార సంఘాల జిల్లా అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి- పద్మనాభం : విశాఖ జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల జిల్లా అధ్యక్షునిగా గల్లా రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక విశాఖపట్నం డిసిసిబిలో నిర్వహించారు. జిల్లాలో సహకార సంఘాల్లో పని చేసిన సిఇఒలు సహకార సంఘం యూనియన్ ఏర్పాటుచేసి ఎన్నికలు నిర్వహించారు. భీమిలి మండలం మద్దివలస పిఎసిఎస్ సిఇఒగా పనిచేస్తున్న రామకృష్ణ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. యూనియన్ కార్యదర్శిగా బాందేవపురం సిఇఒ ఎల్ఎఆర్ ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


పిఎసిఎస్ సిబ్బంది యూనియన్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన రామకృష్ణ

వేతన ఒప్పందం అమలుపై 14న చర్చలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఎన్‌జెసిఎస్ మాదిరిగా 2017 వేతన సవరణ ఒప్పందం విశాఖ ఉక్కులో కూడా అమలుచేయాలని కోరుతూ యాజమాన్యంతో ఈ నెల 14న అన్ని యూనియన్ల నేతలు చర్చించనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు తెలిపారు. విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం సోమవారం ఎఐటియుసి ఆఫీస్‌లో నిర్వహించారు. 2017 వేతన సవరణ జరిగి 13 నెలలైనా విశాఖ ఉక్కులో అమలు జరగపోవడంపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం హాజరైన అఖిలపక్ష కార్మిక సంఘ నాయకుల అభిప్రాయం మేరకు ఈ నెల 14న అన్ని యూనియన్లు వేతన సవరణ అమలు ఒప్పందంపై చివరిగా యాజమాన్యాన్ని కలిసి వారి వైఖరి తెలుసుకుని తరువాత ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కెఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, కె.రాజబాబు, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, యు.రామస్వామి, వైటి.దాస్, గణపతిరెడ్డి, డి.అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస రావు, జిఆర్‌కె.నాయుడు, వై.మస్తానప్ప, వై.రమణ, విళ్ల రామ్మోహన్ కుమార్, మణి, బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, పి.జయ, పరంధామయ్య, జగ్గారావు, జగదీష్, మహాలక్ష్మినాయుడు, కె.శ్రీనివాసనాయుడు, కె.ప్రకాష్, శ్రీనివాస్, బి.డెవిడ్, హెచ్.సన్యాసిరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

14వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కటారి అనీల్ కుమార్‌రాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేటి కిరణ్ కుమార్, కిరణ్‌రాజు, చిన్న, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-సీతమ్మధార : క్రీడలు మానసిక ఉత్తేజాన్ని పెంపొందిస్తాయని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవం సందర్భంగా ఎఫ్‌కెవైఎస్ ఆధ్వర్యాన వైజాగ్ క్షత్రియ యూత్ వింగ్, క్షత్రియ సంక్షేమ సమితి సహకారంతో ఐఎస్ఎన్ రాజు షటిల్ కోర్టులో ఏర్పాటుచేసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్రను వివరించారు. ఆ మహనీయుడి ఆలోచన ధోరణిని, పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్ రాజు, ప్రవీణ్, పృథ్వి, కిషోర్, సతీష్, కిరణ్ రాజు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు వైసిపి నాయకులు సోమవారం గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సిసి.రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, వీధిలైట్లు వెలగడం లేదని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. కల్యాణ మండపం పూర్తిచేయాలని కోరారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో దామోదర్, దానప్పలు, గోవిందరాజులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. అనంతవరం, మద్ది గ్రామాల్లో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన భవనాలను, మద్ది గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపం, పక్కనే సామాజిక భవనం, అనంతవరం జంక్షన్‌లో ప్రయాణికుల విశ్రాంతి భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్ది గ్రామంలో సుమారు రూ.పది కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్ది సర్పంచ్ బి.సన్యాసమ్మ, ఎంపిపి కె.రాంబాబు, నాయకులు కె.పాపారావు, ఎం.శివ, కోరాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి 5వ వార్డు పరిధి పరదేశిపాలెం ప్రాంతాల్లో సుమారు రూ.33.50 లక్షలతో అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. రూ.15 లక్షలతో బొట్టవానిపాలెం సిసి కాలువలు, రోడ్లు, కల్వర్టులకు, రూ.18.50 లక్షలతో ఇడబ్ల్యుఎస్ కాలనీలో సిసి కాలువలు, కల్వర్టులు, రోడ్ల మరమ్మత్తులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పరదేశిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ బొడ్డేపల్లి రాము, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, వార్డు టిడిపి అధ్యక్షులు మొల్లి లక్ష్మణరావు, వర్క్స్ డిఇ వంశీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజుబాబు, వాటర్ సప్లై ఎఇ శ్రీహరి, పోతిన శ్రీనివాస్, పోతిన సురేష్, కొండపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ప్రపంచ బ్యాంకు, ఎస్‌సిఇఆర్‌టి, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యాన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) 9 రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమం సోమవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. మూడు మండలాల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ స్కూలు అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు సుమారు 45 మంది పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థుల ముందు ఉపాధ్యాయులు ఏవిధంగా ఉండాలి, ఎలా ప్రవర్తించాలి అన్న విషయాలపై డిఇఒ ఎల్.చంద్రకళ మాట్లాడారు. టి.జనార్ధనరావు, కె.ఉదయ్ కుమార్ శిక్షకులుగా వ్యవహరించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో టీచ్ టూల్ క్లాస్ రూమ్ బెస్ట్ అబ్జర్వర్ పేరిట హెచ్‌ఎంలు, సిఆర్‌పిలకు శిక్షణా తరగతులను డైట్ ప్రిన్సిపల్ యు మాణిక్యంనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరగతి గదిలో బోధనలో నాణ్యత పెంపుదలకు, విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సిఆర్‌పిలు శిక్షణకు హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ పాల్గొన్నారు.

17న 'స్టీల్' దీక్షల్లో పెన్షనర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -కంచరపాలెం : పెన్షనర్స్ డేను ఈ నెల 17వ తేదీన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో చేపట్టాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. ఎన్ఎడి జంక్షన్ వద్ద గల హమ్సీ భవన్‌లో అసోసియేషన్ జిల్లా సమావేశం సోమవారం బిటి.మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ, మల్కాపురంలో కూడా 'పెన్షనేర్ "డే" చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7,8 తేదీలలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ, జంతర్‌మంతర్ వద్ద జరిగిన సదస్సు, ధర్నా వివరాలను వివరించారు. వచ్చే ఏడాది మార్చి నెలలో చేపట్టే ధర్నాను కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనీస పెన్షన్ రూ.9,000 ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

14న జాబ్ మేళా

ప్రజాశక్తి- కంచరపాలెం : కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి (టెక్నికల్) కె.సుధ తెలిపారు. అపోలో హోమ్ కేర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో హోమ్ కేర్ నర్స్ ట్రైనీ కెమిస్ట్, డెవలప్‌మెంట్ మేనేజర్ తదితర 260 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలకు జిడిఎ, ఎఎన్ఎం, జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్, బిఎస్‌సి కెమిస్ట్రీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 42 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి నెలకు జీతం రూ.12,500 నుంచి రూ.28,200 వరకు ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులు

ప్రజాశక్తి - ములగాడ : నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ విద్యార్థులు 100 మార్కులకు కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టును పూర్తిచేయాలని కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వాటిని విజయవంతంగా అమలుచేసినట్లు సెయింట్ ఆన్స్ కళాశాల ప్రభుత్వ పాలన శాస్త్ర అధ్యాపకులు వై.అనసూయాదేవి తెలిపారు. డిగ్రీ విద్యార్థినులు దాదాపు 470 మంది ఒక్కొక్కరు ఆరు వారాలపాటు కమ్యూనిటీ సర్వీసులో గడిపి, అనేక ప్రాజెక్టులను పూర్తిచేశారని వివరించారు. గ్రామాలలో, మురికివాడల్లోని సమస్యలను తెలుసుకొని, వాటికి పరిష్కారాలను సూచించే కార్యాచరణ ప్రణాళికలను తయారుచేశారని తెలిపారు. అక్షరాస్యతా స్థాయి, డిజిటల్ అక్షరాస్యత, తాగునీరు లభ్యత, ఆన్‌లైన్ షాపింగ్, ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం, డిజిటల్ లావాదేవీలు, ఆరోగ్య సమస్యలు, పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీలు - రోడ్ల పరిస్థితి, మొక్కల పెంపకం, సమాజంపై కోవిడ్ ప్రభావం, కాలుష్యం, ఆరోగ్యవంతమైన జీవన విధానం, పౌష్టికాహార లభ్యత, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, డయాబెటిస్, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాక్సినేషన్, బాల్యవివాహాలు, దిశ యాప్ వినియోగం తదితర అంశాలపై ప్రజలతో విద్యార్థినులు చర్చించారని చెప్పారు. ఈ ప్రాజెక్టులకు సింధియా నుంచి గాజువాక డిపో వరకు గల మురికివాడలను, గాజువాకలోని కొండవాలు ప్రాంతాలను, నర్సీపట్నం, అనకాపల్లి, మునగపాక, చోడవరం, పాడేరు తదితర ప్రాంతాలను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరు ఒకవైపు సామాజిక ఆర్థిక అంశాలపై సర్వే చేస్తూనే, మరొకవైపు ప్రజలలో సామాజిక చైతన్యాన్ని కలిగించారని చెప్పారు. ఈ ప్రాజెక్టులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందజేశారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రూ.35 వేలు చెల్లించిన లబ్ధిదారులకు చలానాతో పాటు ఇంటి పట్టాను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన విధంగా రూ.35 వేలు చెల్లించటం ద్వారా లబ్ధిదారులు తమ ఇంటి పట్టాను పొందగలరన్నారు. ఇప్పటికే వార్డులో ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ ద్వారా స్థలాలను కేటాయించామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడూ వినియోగించుకుని పట్టాను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సిఐ సుధాకర్, సచివాలయం సెక్రటరీలు నాగేశ్వరరావు, నీలవేణి ఆర్‌పి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం: నాగిరెడ్డి

ప్రజాశక్తి-గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 65వ వార్డులో కార్పొరేటర్ బొడ్డ నరసింహ పాత్రుడు అధ్యక్షతన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.51 లక్షల వ్యయంతో కాకతీయ లోవ, భానోజీ తోట రోడ్డు నంబర్ 2, 6, బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, బీటీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయా వార్డుల్లో అపరిష్కృతంగా ఉన్న పనులకు ముందుగా ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, స్థానిక నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, ఇరోతి గణేష్, సింగంపల్లి దేముడు, ఎల్‌వి.రమణ, అడిగర్ల రమణ, వెంకటరావు, రామకృష్ణ, శ్రీరామ మూర్తిరాజు, శ్రీనివాసరాజు, పిల్లా శ్రీనివాస్, దాడి వేణు, సూరిబాబు, గణపతి, కృష్ణ, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, నాయుడు, శ్రీహరి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో 37వ వార్డు పరిధిలోని అంబేద్కర్ కల్యాణ మండపంలో కార్పొరేటర్ చెన్న జానకిరామ్ ఆధ్వర్యాన 350 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ చెన్న జానకిరామ్ మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో ఎవరికి ఏ సహాయం కావాలన్నా సుధాకర్ తన వంతు సహాయ సహకారాలు అదజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరికిటి నారాయణరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్ జైన్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల వెంకటరావు, బోడలపాటి ఉమామహేశ్వరరావు, పచ్చిరపల్లి రాము, 31వ వార్డు ఇన్‌ఛార్జి బత్తిన నవీన్, మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ

నిర్వాసితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా, స్పందనలో వినతి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రోడ్డు విస్తరణ నిర్వాసితులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో 13 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వారందరికీ ఒకే విధంగా పరిహారం చెల్లించాలని కోరుతూ నిర్వాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీహెచ్.అప్పారావు, సిఐటియు నాయకులు బ్రహ్మాజీ, నిర్వాసితుల సంఘం నాయకులు ఆర్ఆర్ శివశరణ, గోవింద తులసీరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, కరణం శ్రీనివాసరావు, మళ్ల చినబాబు మాట్లాడుతూ 13 గ్రామాల్లో భూములు కోల్పోయిన వారికి తక్కువ రేటు ప్రకటించారని, రోడ్డు పక్క అన్ని గ్రామాల భూములకు ఒకే రేటు ఉందని, గజానికి రూ.25 వేలకు తగ్గకుండా అందరికీ నష్టపరిహారం సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్ అండ్ బి పరిధిలో ఉన్న దుకాణాలకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలని, ఇల్లులు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు, ఆర్ కార్డులు ఇవ్వాలని కోరారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని...

అనకాపల్లి : తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, శారదా నది గ్రోయిన్లు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వైఎన్ భద్రం, రాము నాయుడు, రాజాన దొరబాబు, జి గురుబాబు, వి వెంకటరమణ, చెల్లూరి నాగరాజు, మేక సత్యనారాయణ, కె.శంకర్రావు, వి.రాజు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలని...

అచ్యుతాపురం : అచ్యుతాపురం అనకాపల్లి ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని సిపిఎం ఎలమంచిలి నియోజకవర్గ నాయకులు బృందం సోమవారం కలెక్టరేట్ స్పందనలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ ఈ రహదారిలో పెద్ద పెద్ద గోతులు పడడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే అచ్యుతాపురం మండల పరిధిలో 32 మంది ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారని తెలిపారు. పలువురు అంగవైకల్యం చెందారని, వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పేర్కొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

జగనన్న స్మార్ట్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

చోడవరం నియోజకవర్గం పరిధి అడ్డూరులో నిర్మించనున్న జగనన్న స్మార్ట్ సిటీకి సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆవిష్కరించారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎంఐజి లేఅవుట్ డిటిసిపి ఎంఐజి ఆన్లైన్ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్‌లో 165 ప్లాట్లు ఉంటాయన్నారు. వాటిలో పది శాతం ప్రభుత్వ ఉద్యోగులకు, ఐదు శాతం ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వియంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర, జెసి కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ, ఏపీవోలు మౌనిక, వైవి రమణ, ప్రణాళిక అధికారి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీ ఉత్తర్వుల్లో లోపాలు సవరించాలి

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వుల్లో పలు లోపాలు ఉన్న నేపథ్యంలో వాటిని సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రైవేటు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021లో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను తిరిగి ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. 2021 జనవరిలో ట్రాన్స్‌ఫర్‌పై కొత్త పాఠశాలలో చేరి ఇప్పుడు హేతుబద్ధీకరణ స్థానం కోల్పోతున్న ఉపాధ్యాయులందరికీ హేతుబద్ధీకరణ పాయింట్స్, పాత పాఠశాలలో పనిచేసిన కాలానికి స్టేషన్ పాయింట్స్ ఇవ్వాలని కోరారు. 2022 అక్టోబర్లో ప్రమోషన్ కోసం ఒప్పంద పత్రాలు ఇచ్చిన ఉపాధ్యాయులందరికీ ప్రమోషన్ క్యాడర్లోనే బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీఈవో పూల్లో ఉన్న భాషా పండితులు, ఇతర సబ్జెక్టు టీచర్లకు వారి పాత పాఠశాలలో సర్వీస్ పాయింట్స్ ఇస్తూ వారిని స్థిరమైన స్థానాల్లోకి బదిలీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు బదిలీల్లో గతంలో కేటాయించిన ప్రత్యేక పాయింట్స్ ఇవ్వాలని కోరారు.

స్పందనకు 176 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 176 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జెసి కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీ కార్యాలయంలో..

స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలకు చెందిన 26 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గౌతమీశాలి తెలిపారు. వీటిని చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించామన్నారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

43వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసిత ఎనిమిది గ్రామాల ప్రజలు నేవీ మెయిన్ గేట్ ఎదుట చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి 43వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా చేపల వేటకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ 43 రోజులుగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైయస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల ద్వారా పౌష్టికాహారం అందించనున్నట్లు మహిళ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీతామహాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియమిత రోజుల్లో అన్నం, గుడ్డు, ఆకుకూర, ఎగ్ ఫ్రైడ్ రైస్, సాంబారు, బీర, సొరకాయల వంటి కాయగూరలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన సబ్ ప్లాన్ మండలాల్లో రక్తహీనత తగ్గించేందుకు పౌష్టికాహారం, చిన్నపిల్లలకు బాలామృతం ప్యాకెట్‌తో పాటు ఇతర పౌష్టికాహార దినుసులు అందిస్తున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి మెనూ ప్రకారం వచ్చిన భోజనం చేసి వెళ్లాలని సూచించారు.

పెట్రో వర్సిటీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలోని సబ్బవరం మండలం వంగలిలో పెట్రోలియం యూనివర్సిటీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేటాయించిన పెట్రోలియం యూనివర్సిటీకి ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరం మండలం వంగలిలో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని అడిగితే నాటి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఆ భూములు తప్ప వేరే ఆధారంలేని భూ నిర్వాసితులు దిక్కుతోచని పరిస్థితుల్లో గౌరవ హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. నేడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా వారి సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. దీనిపై హైకోర్టు భూ నిర్వాసితులకు చట్ట ప్రకారం పరిహారం చెల్లించి, నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేసి 2 నెలలు కావస్తుందని, అన్ని అనుమతులు వచ్చినా జిల్లా అధికారులు నిర్లక్ష్యం కారణంగానే నేటికీ నిర్మాణ పనులు చేపట్టడం లేదని తెలిపారు. ఇప్పటికే ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన భవనంలో పెట్రో యూనివర్సిటీ విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారని, యూనివర్సిటీ నిర్మాణానికి పుష్కలంగా నిధులు వున్నా నిర్మాణ పనులకు ఎలాంటి అభ్యంతరం లేదని భూ నిర్వాసిత రైతులు జిల్లా అధికార యంత్రాగానికి తెలియజేస్తున్నప్పటికీ నిర్మాణ పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని లోకనాథం డిమాండ్ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు



నమూనాలను గురించి అడిగి తెలుసుకుంటున్న హరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

నానాటికీ పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు సూచించారు. స్థానిక డైట్ కళాశాలలో సోమవారం కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైబ్రంట్ 2022 వార్షికోత్సవ వేడుకలను హరిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో డైటుకు నాలుగవ స్థానం రావడం అభినందనీయమన్నారు. మొబైల్ ద్వారా ప్రపంచంలో అనేక సాంకేతిక అంశాలను సులువుగా తెలుసుకోవచ్చని చెప్పారు. మాజీ మంత్రి, కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్ర గవర్నర్‌గా ఎదిగిన మంచి వ్యక్తి కంభంపాటి హరిబాబు అని, ఆయనతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. జెఎన్‌టియు కాకినాడ వైస్ ఛాన్సలర్ జివిఆర్.ప్రసాద్ రాజు మాట్లాడుతూ విద్యలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో విప్లవాత్మక మార్పులు చేపట్టాయని తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ 2006లో ప్రారంభమైన కళాశాల నేడు 2,500 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు. విద్యార్థులకు సిల్వర్ మెడల్స్, ప్లేస్మెంట్స్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్, ప్రోగ్రాం కన్వీనర్ వైకుంఠరావు, వివిధ శాఖల అధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయండి

ప్రజాశక్తి - పరవాడ

సిఎస్ఆర్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సింహాద్రి ఎన్‌టిపిసి చీఫ్ జనరల్ మేనేజర్ జిసి చౌక్ కోరారు. ఎన్టిపిసి సింహాద్రి ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి స్థానిక తెలుగు పాత్రికేయులను ఆహ్వానించారు. హెచ్ఓహెచ్ఆర్ రుమాడి శర్మ సమావేశాన్ని ప్రారంభించారు. సంస్థ క్రియాశీలతలను కవర్ చేయడంలో మీడియా ప్రాముఖ్యతను వివరించారు. ప్లాంట్ విజయాలు, భవిష్యత్తు అవకాశాలు, గత సంవత్సరం నుండి కంపెనీ నవీకరణల గురించి వివరించారు. అనంతరం చీఫ్ జనరల్ మేనేజర్ చౌక్ మాట్లాడుతూ పరస్పర అవగాహన చేసుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ జిఎం, ఏజిఎం, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌టిపిసి సిజిఎం చౌక్



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు

73 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సచివాలయం వద్ద విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు అరుణ్ కుమార్, చామంతి 73 మంది కంటి రోగులను పరీక్షలు చేశారు. వీరిలో 10 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లగిశెట్టి భవాని, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, ఆర్ఎంపి కంటి వైద్యులు ముక్కుమాల మోహన్‌రావు, కందుల, సాయిరాం, డాక్టర్ వరహాలు, విశ్రాంత ఉద్యోగి ముక్కమల వెంకట్రావు పాల్గొన్నారు.

జీతాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల వెతలు


ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెలా జీతాలు ఇచ్చేందుకు చుక్కలు చూపిస్తుందని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగులతో ఫ్రెండ్లీగా ఉంటామని చెప్పిన జగన్ రెడ్డి ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు చెల్లించడంలో విఫలమైందన్నారు. ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి ఉద్యోగుల్లో నెలకొందని, వారు ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐ, నిత్యవసర సరుకులు, పిల్లల ఫీజులు చెల్లించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ పరిస్థితి బాగుందని చెబుతున్న ముఖ్యమంత్రి ఉద్యోగులకు ప్రతినెల జీతాలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి పిఎఫ్ సొమ్ము, ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఏళ్ల తరబడి అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కుప్పిలి జగన్మోహన్, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

రైవాడ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గొట్టివాడ రెవిన్యూ పరిధిలోని అమలా నికేతన్ పాఠశాల సమీపంలో రైవాడ కాలువలో గుర్తు తెలియని మహిళ మృత దేహం సోమవారం ఉదయం లభ్యమైనట్లు స్థానిక సిఐ రంగనాథం తెలిపారు. మృతురాలి వయస్సు 42 నుండి 50 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేశారు. మృతురాలి దేహంపై నలుపు రంగు జాకెట్, మెరూన్ రంగు లంగా ఉంది. ఎడమ చేతిపై గంగు నాయుడు అని పచ్చబొట్టుతో రాతలు ఉన్నాయి. కుడి చేతిపై చిన్న పువ్వు పచ్చ బొట్టు ఉంది. నుదిటిపై కూడా పచ్చబొట్టు ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా ఆచూకీ తెలిసినవారు సబ్బవరం పోలీసులను సంప్రదించాలని కోరారు.

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు సోమవారం రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచి బండారు నరసింహనాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షులు కన్నూరు సూర్యనారాయణ, గ్రామ పెద్దలు బండారు పోలిబాబు, పారుపల్లి రామకృష్ణ, కూండ్రపు గంగు నాయుడు, బండారు కన్నబాబు, బండారు గంగునాయుడు, పారుపల్లి రాజు, ఆరిపాక చిన్నమ్ములు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

అంతిమ సంస్కారాలకు అవస్థలు

శారదా నది ప్రవాహంతో తప్పని ఇబ్బందులు



శారదా నదిలో దిగి అవతల ఒడ్డుకు దహన సంస్కారాలకు తీసుకెళ్తున్న బంధువులు

ప్రజాశక్తి - దేవరాపల్లి

దేవరాపల్లి మండల కేంద్రంలో ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు చేయడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. శారదా నదికి అవతల శ్మశాన వాటిక ఉండడంతో నది ప్రవాహ సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సోమవారం దేవరాపల్లి మాజీ సర్పంచ్ వరదపురెడ్డి చిన్నమనాయుడు భార్య పైడితల్లమ్మ మృతి చెందగా, ఆమె అంతిమ సంస్కారాలకు శారదా నది దాటి శ్మశాన వాటికకు వెళ్లేందుకు బంధువులు తీవ్ర అవస్థలు పడ్డారు.

దేవరాపల్లిలో 27,800పై చిలుక ఓటర్లు ఉండగా, జనాభా ఇంకా ఎక్కువగానే ఉంటుంది. దీర్ఘకాలం పాటు ఈ పంచాయతీని, మండలాన్ని ఏలిన వారు దేవరాపల్లి గ్రామానికి చెందిన వారే. అయినా ఎవరైనా చనిపోతే శ్మశానికి వెళ్లడానికి సరైన దారి లేదు. శ్మశానంలో నిలువ నీడ, సౌకర్యాలు కరువు. శారదా నది అవతల శ్మశానం ఉండడంతో అంతమ సంస్కారాలకు నదిలో నుంచి వెళ్లాల్సిందే. మొన్నటి వరకు నదిలో కాలిబాట ఉండగా, వర్షానికి అది కొట్టుకుపోయింది. దీంతో నదిలోని నీటి ప్రవాహంలో దిగి మృతదేహాన్ని తీసుకెళ్లాల్సి వస్తోంది. నదీ ప్రవాహం ఎక్కువగా ఉంటే నదికి ఇవతల ఒడ్డునే దహన సంస్కారాలు చేస్తున్నారు. శ్మశాన వాటిక సమస్యపై 2017-18లో సిపిఎం ఆధ్వర్యాన దేవరాపల్లి ప్రజలు నిరాహార దీక్ష చేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. విశాఖ డెయిరీ నిధులతో శ్మశానంలో చేపట్టిన షెడ్డు నిర్మాణం మధ్యలో ఆపేసి ఆ నిధులు మింగేశారు. దీంతో అంతిమ సంస్కారాలకు తీసుకెళ్లేందుకు, అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు దేవరాపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజలు కష్టాలను అర్థం చేసుకొని శ్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేశారు.

వృద్ధురాలికి పింఛను మంజూరు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

'పింఛను కోసం వృద్ధురాలి ఎదురుచూపు' శీర్షికన ఈ నెల 6న ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. బాధిత వృద్ధురాలు సలాది గంగమ్మకు పింఛను మంజూరు చేసి సోమవారం అందజేశారు. 30 రూపాయలు నుండి రూ.2500 పింఛను వరకు 42 సంవత్సరాలుగా వృద్ధురాలు గంగమ్మ పింఛను పొందుతున్నారు. సాంకేతిక కారణాలతో ఎనిమిది నెలలుగా ఆమెకు పింఛను నిలిపి వేశారు. దీంతో ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గునూరు మల్లు నాయుడులు వృద్ధురాలు గంగమ్మను పరామర్శించి ఆమెకు పింఛను పునరుద్ధరించాలని డిమాండ్ చేసిన విషయం విధితమే. పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ వృద్ధురాలికి పింఛను మాన్యువల్‌గా అందం చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం స్థానిక సర్పంచ్ గులజాన శ్రీను, ఇందిరా క్రాంతి పథం ఏపిఎం బాలరాజు వృద్ధురాలుకు రూ.2500 నగదు, నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. ఆగిపోయిన పెన్షన్ పునరుద్ధరణ జరగడంతో వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శరగడం సత్యవతి, కార్యదర్శి అమర పిన్ని వరలక్ష్మి, కోశాధికారి సెలప రెడ్డి సత్యవేణి, సీసీ గణేశ్వరరావు వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : ధర్మశ్రీ



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -చోడవరం

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న వైసిపి ప్రభుత్వాన్ని మరల ఆదరించాలని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కోరారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని గోవాడలో చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్చి వివరించారు. మళ్లీ వైసిపి ప్రభుత్వానికి అధికారం ఇవ్వాలని కోరారు. తమకు ఇల్లులు మంజూరు చేయాలని కొంతమంది ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అర్హులైన వారందరికీ పేర్లు నమోదు చేసి ఇల్లులు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, తహశీల్దారు బి తిరుమల బాబు, ఎంపీడీవో ఎస్‌డి శ్యామ సుందర్, పిఆర్‌డిఈ జి ఎస్ ప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యారావు, వైసిపి నాయకులు బి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తంతడి గ్రామంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార వర్మ సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుల పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వికలాంగురాలైన ఒంటరి మహిళలకు తమ సొంత నిధులు రూ.10వేలు అందజేశారు. వాలంటీర్లకు పనితీరును అభినందిస్తూ సొంత నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ప్రూఫ్ బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, దేశం శెట్టి శంకర్రావు, రాజాన అప్పారావు, నర్మల కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కొణెంపూడి సర్పంచ్ సత్యనారాయణ

సమగ్ర సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని మండలంలోని కొణెంపూడి సర్పంచ్ ఆది సత్యనారాయణ తెలిపారు. సోమవారం కొన్నెంపూడిలో సమగ్ర భూ సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు లేకుండా భూ సర్వే నిర్వహించి రైతులకు మేలు జరగా విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ ఆది సూర్య ప్రకాష్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని మండలంలోని సునపర్తి గ్రామ సర్పంచ్ చొక్కా అనురాధ అన్నారు. సోమవారం గ్రామంలో సోమవారం డ్రోన్ ద్వారా సర్వే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, జి.నరసింహనాయుడు పాల్గొన్నారు.

రామోజీరావు దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఈనాడు దినపత్రికలో వచ్చిన కథనాలను నిరసిస్తూ దేవరాపల్లి మండలానికి చెందిన గ్రామ వాలంటీర్లు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. అనంతరం ఈనాడు అధినేత రామోజీరావు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. స్వచ్ఛంద సేవకుల పట్ల అవాస్తవ కథనాలు ప్రచురించడం సబవు కాదని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు.

విఆర్ఓల సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా శంకరరావు

ప్రజాశక్తి- దేవరాపల్లి : విఆర్ఓల సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా దేవరాపల్లి మండలం ఎం.అలమండ గ్రామానికి చెందిన, కె.కోటపాడు మండలం కోరువాడ విఆర్ఓ పోతల శంకరరావు ఎన్నికయ్యారు. ఆదివారం సబ్బవరంలో జరిగిన ఎన్నికల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ నూతన జిల్లాలో తనకు ఇంతటి పదవిని అప్పగించిన తోటి వీఆర్వోలకు ధన్యావాదాలు తెలిపారు. శంకరరావుకు దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి - దేవరాపల్లి : మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి తడిసి ముద్దయిన మండలంలోని ఎం.అలమండ గ్రామంలోని వరి పంటను సోమవారం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ భవాని, డిఎఎటిటిసి కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, ఉప్పు ద్రావణాన్ని కోసిన వరి పనలపై పిచికారీ చేసినట్లయితే ఆ పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. ఏ రకంగా పిచికారి చేయాలో, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-అనకాపల్లి స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో సోమవారం ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు బి.జగదీష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా టి.సాంబమూర్తి నాయుడు, సహాధ్యక్షులుగా పి.భవాని, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాస్, పి.స్వామి నాయుడు, ఎం.శంకర్ రావు, కార్యదర్శిగా షేక్ సిలార్, సంయుక్త కార్యదర్శులుగా బి.సంపం, కె.శ్రీనివాస్, డి.వెంకటరావు, పి.ఉదయ లక్ష్మి, కోశాధికారిగా ఎన్.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదేటి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో సోమవారం సిఎల్సి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కోలిమల్ల అచ్చం నాయుడు ప్రారంభించారు. దిబ్బిడి, నేతవానిపాలెం, బుచ్చయ్యపేట, కందిపూడి, కెపి.అగ్రహారం తదితర గ్రామాల నుండి రోగులు తరలివచ్చారు. వారికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎల్సి మినిస్ట్రీస్ అధినేత సుధీర్ కుమార్ మహంతి, మెర్సీ మహంతి స్థానిక సర్పంచ్ పెద్దిరెడ్డి మాణిక్యం, ఎంపీటీసీ గొంప వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచ్ గొంప అప్పారావు, పాస్టర్ రాజేష్, పెద్దిరెడ్డి రమణబాబు పాల్గొన్నారు.

రైతన్నకు కష్టకాలం

మాండూస్ దెబ్బకు తడిసి ముద్దయిన వరి.. చక్కబెట్టే పనుల్లో తలమునకలు



పంట నష్టాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : వరి పంట చేతికందే సమయంలో మాండూస్ తుఫాన్ అన్నదాతలపై పగబట్టింది. వరి పంట కోత దశకు చేరుకున్న సమయంలో, చేతికి రావలసిన పంట కళ్ళ ముందే వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5115 ఎకరాలలో వరి సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉండడంతో .మంచి దిగుబడి వస్తుందని రైతులంతా భావించారు. ఇప్పటికే 30 శాతం వరకు కోతలు కోసి, కుప్పలు వేశారు. సుమారుగా 399 ఎకరాల్లో కోసిన వరి పొలాల్లోనే ఉంది.తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షానికి వరి పనలు తడిసి ముద్దయ్యాయి. కొన్నిచోట్ల వరి చేను నేలకు ఒరిగింది. పలు గ్రామాల్లో చాలామంది రైతులు కోసిన వరి చేను ఆరకుండానే కుప్పలు వేశారు. అధిక పెట్టుబడులతో అప్పుల పాలైన రైతాంగానికి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరిని కాపాడుకోవడానికి మళ్లీ కూలీలను పెట్టి మదుపులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు తడిసిపోయిన వరి పనలపై ఉప్పు ద్రావకం చల్లడం, నేలకు ఒరిగిన వరి చేనును నిలబెట్టే పనుల్లో రైతన్నలు బిజీ బిజీగా ఉన్నారు .

పంట నష్టాలను అధికారులు పరిశీలన

మండలంలోని గొడిచెర్ల, ఉద్దండపురం ,కాగిత, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో సోమవారం వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేశారు.వరి పొలాల్లో ఉన్న వరి పనలను, నేలకొరిగిన వరి చేనును పరిశీలించారు .రైతులు తీసుకోవలసిన జాగ్రత్తగా పై అవగాహన కల్పించారు. రైతులు తక్షణమే తడిసిపోయిన వరిని లీటర్ నీటికి 50 గ్రాములు ఉప్పు ను కలిపి పనలు తడిచే విధంగా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. దీని వలన గింజ రంగు మారకుండా, మొలకెత్త కుండా వుంటుందని, కాబట్టి రైతులందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి వాసుదేవరావు

ప్రజాశక్తి - మాడుగుల : ధాన్యం కొనుగోలుపై మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కేజే పురంలో అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం వాసుదేవరావు మాట్లాడుతూ క్వింటాలు ధాన్యం సాధారణ రకానికి రూ.2,040, ఫైన్ రకాలకు రూ.2,060గా ప్రభుత్వం ధర నిర్ణయించిందని, దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి విక్రయించుకోవాలని కోరారు. ఇటీవలి వర్షాలకు తడిచిన ధాన్యం పాడవకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి భీశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ రమణబాబు పాల్గొన్నారు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మాకవరపాలెం: తుఫాన్ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని నర్సీపట్నం జనసేన నేత సూర్యచంద్ర డిమాండ్ చేశారు సోమవారం. జి కోడూరు గ్రామంలో వర్షాలకు తడిసిన వరి పొలాలను పరిశీలించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించి, ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, తడిసిన, నాణ్యత చెడిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్రీ సురేష్, సేనాపతి శేషు సంతోష్, అచ్చియ్య నాయుడు ఉన్నారు

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈనెల 21న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ గణేష్ తెలిపారు. రక్తదాన శిబిరంలో నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాల నుండి భారీ ఎత్తున కార్యకర్తలు విచ్చేసి రక్తదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిర పోస్టర్ ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి , మాకవరపాలెం ఎంపిపి సత్యనారాయణ, గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, నర్సీపట్నం ఎంపిపి సుర్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత అప్పారావు మృతి



అప్పారావు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మామిడి వానిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మామిడి అప్పారావు (75) అనారోగ్యంతో సోమవారం తన స్వగృహంలో మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారన్నారు.

అప్పారావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాజకీయ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి కుటుంబసభ్యులను ఓదార్చారు. తెలుగు దేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కురుందాసు నూకరాజు తదితరులు అప్పారావు మృతదేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన పార్టీకి అందించిన సేవలను గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి , శీను , లేటి శ్రీను, మాజీ ఎంపిటిసి కొప్పిశెట్టి హరి, నూకతాత తదితరులు అప్పారావు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి



తడిసిన వరిచేనును పరిశీలిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : మాండూస్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులకు వరికి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు సోమవారం తిమ్మాపురంలో పంటనష్టాలను రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ పరిశీలించారు ఈసందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వరిచేలు నేలమట్టం అయ్యాయని, కోసిన వరిచేను నీరు ముంపునకు గురై పంట నష్టం జరిగిందన్నారు. మండలంలో ప్రాథమిక అంచనా ప్రకారం 947 ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పంట నష్టం ఇంకా ఎక్కువగానే ఉన్నందున క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి, పంటనష్టాలు,బాధిత రైతులను గుర్తించి, ప్రభుత్వానికి నివేదించం ద్వారా ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. తిమ్మాపురం రెవెన్యూ లో తుమ్మి శంకరరావు అనే కౌలు రైతు 2 ఎకరాలు కౌలుకు వరి సాగుకు రూ. 60 వేలు వరకు పెట్టుబడి పెట్టారని, ఇపుడు పంట పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు.

టిడిపితో రాష్ట్రాభివృద్ధి



నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- చీడికాడ : రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని, మరలా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ అన్నారు చీడికాడ మండలం పెద గోగాడ గ్రామంలో సోమవారం ఇదేమీ ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ధరలు పెరుగుదలతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వైసిపి అరాచక పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో అనేక ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందని, ప్రశ్నించే వారెవరైనా వేధించడమే తప్ప, తప్పులు సరిదిద్దుకుని అభివృద్ధి చేసే దాఖలాలు వైసిపి పాలనలో కనిపించడం లేదన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపికి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి జయమ్మ, టిడిపి నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు బ్యాంక్ కాలనీలో రూ. 12.80 లక్షలతో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. వార్డ్ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ , సచివాలయ సిబ్బంది. పాల్గొన్నారు.

'సమాచార' బోర్డులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల వద్ద సమాచార హక్కు బోర్డులను ఏర్పాటు చేయాలంటూ ఎంపిడిఒ వెంకన్న బాబుకు కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ ప్రతినిధులు సత్తిబాబు, ఎస్ నాగేశ్వరరావు, జి నానిబాబు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ఏదైనా ఒకకార్యాలయంలో సమాచారాన్ని తీసుకోవటానికి పూర్తి వెసులుబాటు ఉండాలన్నారు. మండల ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపైన అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల మేరకు ప్రజలకు అవసరమైన విషయాలను 30 రోజులు దాటకుండా సమాచారాన్ని అందజేయాలని కోరారు.

వృద్ధాశ్రమానికి ఆర్ఎంపిల వితరణ

ప్రజాశక్తి-చీడికాడ : చోడవరం డివిజన్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తరపున కి స చీడికాడ మండలం, అప్పలరాజు పురం గ్రామంలోనిశ్రీ లలితాదేవి వృద్ధాశ్రమానికి రూ.8 వేలు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు ఏల లక్ష్మికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డి.అమిత్ కుమార్ ఐ కొండలరావు, శ్రీను, డి.మూర్తి, గణేష్, గోవింద రామస్వామి, నాగేశ్వరరావు, నానాజీ, ఆర్ వాసు పాల్గొన్నారు.

చెత్త తరలింపునకు ట్రైసైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో వివిధ పంచాయతీల్లో చెత్త తరలింపునకు 25 ట్రై సైకిళ్ళు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి పంపిణీ చేశారు. వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్లకు నేటి వరకు పింఛనులు అందకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని జిల్లా గ్రంథాలయం సంస్థ పింఛన్‌దారుల సంఘం అధ్యక్షులు పి మల్లేశ్వరరావు తెలిపారు. హాస్పిటల్, మందుల ఖర్చులు, ఇంటి నిర్వహణ భారం అధికమై తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శికి, పౌర గ్రంథాలయశాఖ సంచాలకులకు, రాష్ట్ర ఖజానా శాఖ అధికారులకు ఈ నెల 6వ తేదీన లేఖరాశామన్నారు. ఇప్పటికే 12వ తేదీ గడిచిపోయినా పింఛను అందకపోతే, విశ్రాంత ఉద్యోగులు కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి సోమవారం ఈ-మెయిల్ పంపినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలం కొంకసింగి గ్రామంలో సత్యసాయి బాబా సేవా సంఘం ఆధ్వర్యంలో విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాంప్ ఆర్గనైజర్ సాయికృష్ణ మాట్లాడుతూ విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్ ఆర్గనైజర్ డాక్టర్ జివి.గోపాల్‌రాజు, డాక్టర్ పి.వాసుదేవ్ మంచి ప్రోత్సాహం ఇస్తూ కంటి సమస్యలతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించారన్నారు. విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ శివకృష్ణ పాల్గొని, 150 మంది కంటి రోగులను పరీక్షించి 30 మంది ఆపరేషన్ అవసరమని గుర్తించారు.

ఉపాధి పనులకు ప్రతిపాదన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రం లో సచివాలయం వద్ద సోమవారం సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో, కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఉపాధి గ్రామసభలో కోటి రూపాయలతో 20 అభివృద్ధి పనులను గుర్తించినట్లు సర్పంచ్ అనిల్ కుమార్ తెలిపారు. ఎపిఒ గంగు నాయుడు, విఆర్‌పి అనిత పలువురు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై రోలుగుంట ఎస్సీ కాలనీలో వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. పెరుగుతున్న హెచ్ఐవి కేసులను తగ్గించుటకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సమిధ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ వరహాలు బాబు, ఓఆర్‌డబ్ల్యు సిహెచ్.బాలు, ఎఎన్ఎం లక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిఐటియు విశాఖ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 22, 23 తేదీల్లో డాబాగార్డెన్స్ వద్దగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగే సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మద్దిలపాలెంలోని సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బి.జగన్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కెఎం.కుమార్ మంగళంతో కలిసి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో మూడేళ్లలో సిఐటియు స్వతంత్రంగా నిర్వహించిన కార్యక్రమాలతోపాటు ఐక్య కార్యాచరణ పోరాటాలు, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కార్మికుల సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. జిల్లాలోని సంఘం అనుబంధ రంగాల నుంచి 360 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమగ్రంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభల పర్యవేక్షణకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

పాఠశాల పేరు మార్చాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే బాబూరావుకు విన్నవిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- యస్ రాయవరం.: .మండలంలోని చినగుమ్ములూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పేరును మార్చాలంటూ ఎమ్మెల్యే గొల్లబాబూరావుకు గ్రామస్థులు విన్నవించారు. సోమవారం ం చిన గుమ్ములూరు గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు పాల్గొన్నారు. ముందుగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రెండవదశ నాడు నేడు పనులకు శంకుస్థాపన చేశారు.కోటి ఇరవై మూడు లక్షల నాడు నేడు నిధులతో విద్యార్థుల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక వైసిపి నేత శ్రీను మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మాజీసర్పంచ్,కోసూరి చినకోటిపల్లి నాయుడు పేరును జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రుల కమిటీ, గ్రామస్తుల సంతకాలతో కూడిన విజ్ఞాపనను అందిస్తే, సంబంధిత విద్యాశాఖాధికారులతో మాట్లాడి పేరు మార్పునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక నేతలు మైలారు శ్రీనువాస్, పోలిశెట్టి పెదఈశ్వరరావు, చేకూరి రాముురాజు, మాతా గుర్నాధరావు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జిల్లాల విభజన నుండి ఇప్పటి వరకు సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు ఇవ్వాల్సిన మెస్ ఛార్జీలు బిల్లులు చెల్లించాలని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నేతల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు మెస్‌చార్జీలు చెల్లించకపోవడంతో వార్డెన్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెస్ చార్జీల బిల్లులు సకాలంలో ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించలేదన్నారు. సకాలంలో మెస్ చార్జీలు బిల్లులు ఇవ్వకపోతే హాస్టళ్లను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొందరు ఉద్యోగులకు ఇప్పటికీ నెలసరి జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు.

ఒక్క సెంటూ వదులుకోం

- భూముల పరిరక్షణకు ప్రాధాన్యత
- ఇచ్చిన భూమి వెనక్కు తీసుకోవడానికి లేదు
- భూముల క్రయ, విక్రయాలు చెల్లవు
- 'ప్రజాశక్తి'తో దేవాదాయ శాఖ జిల్లా అధికారి బుద్ధ లక్ష్మి నగేష్



బుద్ధ లక్ష్మి నగేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. భూములు ప్రయివేటు వ్యక్తుల పాలుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆక్రమణలోవున్న భూముల స్వాధీనానికి కృషి చేస్తున్నాం. దేవాలయ భూములు, ఖాళీ స్థలాల ద్వారా ఏడాదికి రూ.91.82 లక్షల ఆదాయం వస్తోంది. 78 దేవాలయాలకు దూపదీప నైవేద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. ఒకసారి దేవాలయాలకు భూములు అప్పగించిన తరువాత మళ్లీ వెనక్కు తీసుకోవడానికి దేవాదాయ చట్టంలో అవకాశంలేదు. దేవాలయ భూములు క్రయ విక్రయాలకు తావులేదు. ఎవరైనా తెలిసో, తెలియక కొన్నా నష్టపోతారు. ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం' - అని జిల్లా దేవాదాయశాఖాధికారి బుద్ధ లక్ష్మి నగేష్ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో ఏ తరహా దేవాలయాలు ఎన్ని వున్నాయి ?

జిల్లాలో 6ఎ దేవాయాలు రెండు, 6బి-26, 6సి-55, 6ఇ-ఒకటి, ఏ ఆదాయములేని దేవాలయాలు(ఎన్ఎన్ఎ) 622 వున్నాయి. 78 దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం దూపదీప నైవేద్యం కింద ఐదువేల రూపాయలు ఇస్తోంది.

దేవాలయాల పేర ఎంత భూమి వుంది ?

జిల్లాలోని 287 గ్రామాల్లో దేవాలయాలకు 6,875 ఎకరాలుంది. అందులో అర్చక ఇనాం కింద 5,50 ఎకరాలు, సర్వీసు ఇనాంగా 157 ఎకరాలు, కౌలుకు ఇచ్చిన భూమి 1865 ఎకరాలు, ఆక్రమణలో 2,680 ఎకరాలుంది. 188 ఎకరాల్లో ఖాళీ స్థలాలున్నాయి. కౌలు, ఖాళీ స్థలాల ద్వారా ఏడాదికి రూ.91.82 లక్షల రూపాయల ఆదాయం వస్తోంది.

ఆక్రమణలను తొలగించేందుకు తీసుకుంటున్న చర్యలేంటి ?

భూములు ఆక్రమణకు గురికాకుండా చూస్తున్నాం. ఇప్పటికే ఆక్రమణలకు గురైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కొన్ని న్యాయస్థానంలో వున్నాయి. మరికొన్ని ఒరిజినల్ అప్లికేషన్ స్థాయిలో వున్నాయి. దేవాలయ భూమి వదులుకొనే ప్రసక్తిలేదు. ఎవరు ఆక్రమించినా, క్రయవిక్రయాలు జరిపినా అది ముమ్మాటికీ దేవాదాయశాఖకు చెందుతుంది తప్ప ప్రయివేటు వ్యక్తులకు యాజమాన్య హక్కు రాదు.

దేవాలయాలకు ఇచ్చిన భూమిని వెనక్కుతీసుకొనే అవకాశముందా ?

ఒకసారి దేవాలయాలకు ఇచ్చిన భూమిని వెనక్కు తీసుకొనే అవకాశంలేదు. దేవాలయాలకు ఇచ్చిన భూమి తిరిగి తీసుకుంటామని వారసులెవరొచ్చినా ఇవ్వడానికి దేవాదాయ చట్టం అంగీకరించదు. ఒకసారి అప్పగించాక వెనక్కుతీసుకొనే వెసులుబాటు చట్టంలో లేదు.

దేవాలయ భూములపై నేరుగా కోర్టుకు వెళ్లొచ్చా ?

దేవాదాయ భూములకు సంబంధించిన సమస్యలపై తొలుత తప్పనిసరిగా గుంటూరు జిల్లా, పెదకాకానిలోని దేవాదాయ ట్రిబ్యునల్ కోర్టులో ఫైల్ చేసుకోవాల్సివుంది. దూర ప్రాంతాల నుంచి అక్కడకు వెళ్లలేనివారి కోసం విశాఖపట్నంలోని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో నెలకు ఒకసారి పీరియాడికల్‌గా క్యాంప్ కోర్టు నడుస్తోంది. ట్రిబ్యునల్ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని వారు కోర్టులను ఆశ్రయించవచ్చు. మొదట దేవాదాయ ట్రిబ్యునల్ కోర్టులో ఫైల్ చేసుకోవాలి.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నక్కపల్లిలో ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి నక్కపల్లి : రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఎంపికైనట్లు పీడీ. కుందూరు రాజు తెలియజేసారు. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించినఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 బాలుర హాకీ పోటీలలో కె వెంకటేశ్వరరావు, ఎం దీపక్ కుమార్, కె. నాగ తరుణ్, కె దుర్గా వెంకటసాయి, డి రోహిత్ కె.బాలు ప్రతిభని కనబరి అనంతపురంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని సోమవారం పాఠశాలలో హెచ్ఎం రాణి లలిత ఆధ్వర్యంలో ఎంఇఒ డివిడిప్రసాద్ అభినందించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఎన్.అప్పారావు, బాబూజీ, విశ్వనాధ్, సుందరరావు, హాకీ క్లబ్ కార్యదర్శి తాతాజీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కనోసా విద్యార్థిని దీక్ష

పాయకరావుపేట : రాష్ట్రస్థాయిలో హాకీ పోటీలకు ఎంపికైన పాయకరావుపేట కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని ఎం దీక్ష సానికారెడ్డిని ప్రిన్సిపాల్ సిస్టర్స్ సోఫియా సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సోఫియా మాట్లాడుతూ అనంతపురంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, పాఠశాలకు మంచి పేరు తేవాలని దీక్ష సానిక రెడ్డిని అభినందించారు. పిటి శ్రీను ఉపాధ్యాయులు అభినందించారు,



దీక్షను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ సోఫియా

గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి



కోటవురట్లలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి కోటవురట్ల : గ్రామీణ ప్రాంత అభివద్ధిపై ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు,ఇతర ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి రెండు శిక్షణను ప్రారంభించారు. ఎంపిపి అప్పలనాయుడు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, వైఎస్ ఎంపిపిదత్తుడు రాజు పాల్గొన్నారు. శిక్షణలో రెండు రోజులపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయవనరుల అభివృద్ధి, పారిశుధ్య. ఆరోగ్యం, తాగునీరు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు, కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరిని ఎంపిడిఒ అరుణ శ్రీ అన్నారు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల శిక్షణను ప్రారంభించారు. గ్రామాలు అభివృద్ధికి 9 అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు కార్యక్రమంలో ఎంపిపి రు త్తుల సత్యనారాయణ. జెడ్‌పిటిసి పెట్ల సత్యవేణి. వైస్ ఎంపిపి రత్తుల సత్యవతి. ఇఒపిఆర్‌డి సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు

రోలుగుంట : గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023-2024 సంవత్సరానికి సంబంధించి ప్రజాప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ప్రభాకర్, ఈఒపిఆర్‌డి మల్లికార్జునరావు, వైస్ ఎంపిపి సన్యాసినాయుడు, పాల్గొన్నారు.

తూటిపాలలో గడపగడపకూ..



వీల్‌చైర్‌లో ఇంటింటికీ వెళుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి మాకవరపాలెం : సంక్షేమమే పరమా వధిగా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం తూటిపాల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు వీల్‌చైర్‌లో వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరదీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై, సంక్షేమ పథకాలు రాకుంటే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో. ఎంపిపి రత్తల సత్యనారాయణ, వైసిపి మండలఅధ్యక్షుడు వాసు, ఎంపిటిసి సత్యవతి. సర్పంచు. ప్రసాద్‌రాజు, భీమ్ రెడ్డి, గోవింద పాల్గొన్నారు

గొలుగొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విశాఖ రేంజ్ డిఐజి



పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న డిఐజి

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలన చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. గంజాయి రవాణా అరికట్టడానికి కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ గౌతమిశాలి, నర్సీపట్నం డిఎస్పి ప్రవీణ్ కుమార్, గొలుగొండ ఎస్ఐ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు